

కరుడు గట్టిన నేరస్తుడి కోసం ముమ్మర గాలింపు

- 15 ప్రత్యేక బృందాల ఏర్పాటు
- 70 కేసుల్లో ప్రభాకర్ ముద్దాయి
- నాలుగు రాష్ట్రాల్లో కేసులు
- ఇద్దరు ఎస్కార్ట్ కానిస్టేబుళ్ల సస్పెన్షన్
- డీఎస్పీ దేవకుమార్ వెల్లడి


దేవరపల్లిలో మాట్లాడుతున్న కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్

దేవరపల్లి: పోలీసుల కళ్లు కప్పి సోమవారం రాత్రి పారిపోయిన కరుడు గట్టిన నేరస్తుడు బత్తుల ప్రభాకర్ కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. వివిధ కేసుల్లో ముద్దాయిగా ఉండి రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ఖైదీగా ఉన్న ప్రభాకర్ తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం దుద్దుకూరు వద్ద చేతులకు బేడీలతో పరారైన సంఘటన పాఠకులకు తెలిసిందే. విషయం తెలుసుకున్న పోలీసు అధికారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఏలూరు డీఐజీ అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ సీఐ నాగేశ్వరనాయక్ హుటాహుటీన ఘటనా స్థలానికి చేరుకుని నేరస్తుడి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. సుమారు 50 మంది యువకులతో బైక్‌లపై పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఫలితం లేకపోయింది. అర్ధరాత్రి వరకు యువకులు, పోలీసులు పొలాల్లో గాలించారు.


పోలీసుల కళ్లుకప్పి పరారైన నేరస్తుడు బత్తుల ప్రభాకర్ (ఫైల్)

15 ప్రత్యేక బృందాల ఏర్పాటు

పోలీసుల కళ్లుకప్పి పరారైన నేరస్థుడు బత్తుల ప్రభాకర్ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్టు కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ తెలిపారు. మంగళవారం దేవరపల్లి పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. 15 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ముద్దాయి కోసం గాలిస్తున్నట్టు ఆయన చెప్పారు. నేరస్థుడు ప్రభాకర్‌పై ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, కేరళలో సుమారు 80 కేసులు నమోదైనట్టు తెలిపారు. 2011 నుంచి ప్రభాకర్ నేరాలకు పాల్పడుతూ పట్టుబడినట్టు ఆయన చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి, ఉండ్రాజవరం పోలీస్ స్టేషన్లలో దొంతనం కేసుల్లో ముద్దాయిగా ఉన్నట్టు ఆయన చెప్పారు. 2022లో హైదరాబాద్‌లోని గచ్‌బౌలిలోని పబ్‌లో ఉన్న అతనిని పట్టుకోవడానికి వెళ్లిన పోలీసులపై ప్రభాకర్ కాల్పులు జరిపినట్టు ఆయన చెప్పారు. ఫీజులు కట్టే సమయంలో విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు, గృహాలను లక్ష్యంగా పెట్టుకుని ఒంటరిగా దొంగతనాలు చేస్తాడని తెలిపారు. ఉండ్రాజవరం మండలం వేలివెన్ను కాలేజీలో రూ.30 లక్షలు, దేవరపల్లి మండలంలో రోమన్ కేథలిక్స్ స్కూల్లో రూ.3 లక్షలు చోరీ చేసినట్టు ఆయన తెలిపారు. 10 మంది సీఐలు, 15 మంది ఎస్సైలు, 40 మంది పోలీసులతో రాత్రంతా పొలాల్లో గాలించడంతో పాటు ప్రత్యేక చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి వాహన తనిఖీలు నిర్వహించినట్టు ఆయన తెలిపారు. మంగళవారం ఉదయం డాగ్ స్క్వాడ్‌తో గాలించినట్టు ఆయన తెలిపారు. కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని గాలిస్తున్నట్టు ఆయన చెప్పారు. పీటీ వారెంట్లపై రాష్ట్రంలో ఎక్కడైతే కేసులు ఉన్నాయో అక్కడకు తీసుకు వెళుతున్నట్టు చెప్పారు. పారిపోయిన సమయంలో చేతికి హ్యాండ్ కప్స్, వైట్ కలర్ టీ షర్టు, బ్లాక్ కలర్ ట్రాక్ ఫ్యాంటు ధరించి ఉన్నట్టు తెలిపారు. ఎక్కడెక్కడ నేరాలు చేస్తున్నాడు, సన్నిహితుల ఆచూకీని తెలుసుకుంటున్నట్టు ఆయన చెప్పారు. ముద్దాయి ఆచూకీ తెలిపిన వారికి రూ.50 వేల పారితోషికం ఇవ్వనున్నట్టు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు దేవరపల్లి పోలీసుల మొబైల్ నెంబర్లు 94407 96584 (సీఐ), 9440796624 (ఎస్సై)కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ప్రభాకర్‌పై అనేక కేసులు

చిత్తూరు జిల్లాకు చెందిన బత్తుల ప్రభాకర్ కరుడుగట్టిన నేరస్తుడని పోలీసులు చెబుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాల్లో ప్రభాకర్‌పై అనేక కేసులు ఉన్నాయి. పలు కేసుల్లో రిమాండ్ ఖైదీగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ఉంటున్నాడు. సోమవారం ఉదయం ఒక కేసులో పోలీసులు విజయవాడ కోర్టుకు తీసుకు వెళ్లి తిరిగి వస్తుండగా దేవరపల్లి మండలం దుద్దుకూరు వద్ద హైవేపై గల హోటల్ వద్ద ఆగారు. ఆ సమయంలో ప్రభాకర్ టీ తాగడానికి చేతులకు ఉన్న హ్యాండ్స్ కప్స్‌ను ఒక చేతిది తీసి మరొక చేతికి ఉంచారు. టీ తాగుతున్న క్రమంలో బత్తుల ప్రభాకర్ ఎస్కార్ట్ పోలీసుల కళ్లు కప్పి హోటల్ వెనుక నుంచి పొలాల్లోకి పరారయ్యాడు. ఎస్కార్ట్ పోలీసులు వెంటపడినప్పటికీ దొరకలేదని డీఎస్పీ దేవకుమార్ తెలిపారు. ప్రభాకర్‌కు ఇద్దరు ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లు ఎస్కార్ట్‌గా వెళ్లారు. వీరిద్దరిని విజయవాడ నగర పోలీస్ కమిషనర్ సస్పెండ్ చేశారు.







ఆర్టీసీ బస్సు ఢీకొని మోటార్ సైక్లిస్ట్ మృతి


తీపర్రులో రేకుల షెడ్డులోకి దూసుకుపోయిన ఆర్‌టీసీ బస్సు


సత్యనారాయణ మృతదేహం

పెరవలి: గోతుల రోడ్డులో ఆర్టీసీ బస్సు అదుపు తప్పి మోటార్ సైక్లిస్టును ఢీకొట్టి అక్కడితో ఆగకుండా పక్కనే ఉన్న రేకుల షెడ్డును ఆ తరువాత విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి ఆగింది. ఈ ప్రమాదంలో మోటార్ సైక్లిస్ట్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. నిడదవోలు–నరసాపురం ఆర్‌అండ్‌బీ రోడ్డులో తీపర్రు వద్ద మంగళవారం ఆర్టీసీ బస్సు వీరంగం సృష్టించింది. తణుకు నుంచి రాజమహేంద్రవరం వస్తున్న ఆర్‌టీసీ బస్సు తీపర్రు వద్ద రోడ్డుపై ఉన్న గోతుల్లో పడి బస్సు అదుపు తప్పింది. అదే సమయంలో మండలంలోని కడింపాడుకి చెందిన సలాది సత్యనారాయణ (50) బైక్‌పై తీపర్రు నుంచి పెరవలి వస్తుండగా వేగంగా వచ్చిన బస్సు ఢీకొట్టడంతో ఎగిరి రోడ్డ పక్కన ఉన్న ఇంటి అరుగుపై పడ్డాడు. బస్సు ఢీకొన్న వేగానికి సత్యనారాయణ తలకు బలమైన గాయం అయింది. తణుకులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. బస్సు వేగంగా ఢీకొట్టడంతో రేకుల షెడ్డు, విద్యుత్ స్తంభం నేలకొరిగాయి. ఈ బస్సు ప్రమాదం రోడ్డుకి రెండో వైపున జరిగి ఉంటే బస్సు నేరుగా కాలువలోకి వెళ్లిపోయేదని, ఆ సమయంలో బస్సులో ఉన్న 60 మందికి ప్రమాదం సంభవించేదని స్థానికులు అంటున్నారు. మృతదేహాన్ని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పెరవలి ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. మృతుడుకి భార్య సత్యరాధ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

బార్ తొలగించాలని ఆందోళన

నిడదవోలు: పట్టణంలో సుబ్బరాజుపేటలో ఏర్పాటు చేసిన చైతన్య బార్ – రెస్టారెంట్ తొలగించాలని స్థానికులు మంగళవారం బార్ వద్ద ఆందోళన చేశారు. దళితులు, శ్రామికుల కుటుంబాలను దోచుకోవటానికే ప్రశాంతంగా ఉండే ఈ ప్రాంతంలో మద్యం బార్లు తెరుస్తున్నారని ఆందోళనకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బైపే రాజేశ్వరరావు, సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు, టి.ప్రేమ్‌కుమార్ ఎం. భాను, బి.నాని, నక్కా సురేష్, గుమ్మడి రాజు, ఎం.డేవిడ్ వి. పవన్ కుమార్, వి. కళ్యాణ్, జాన్, పుల్లారావు పాల్గొన్నారు.

ఆగని మరణ మృదంగం

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవంలో అంతుచిక్కని వ్యాధితో పాడి గేదెలు మృత్యువాత పడుతూనే ఉన్నాయి. దీంతో పాడి రైతులు విలపిస్తున్నారు. గ్రామానికి చెందిన గెడ్డం మణికంఠకు చెందిన పాడి గేదె కొద్ది రోజులుగా వ్యాధిబారిన పడి మంగళవారం మృతి చెందింది. మందులు వాడినా, వ్యాక్సిన్లు వేసినా ప్రయోజనం లేదని అతను ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం జమ్ముల శ్రీనుకు చెందిన పాడి గేదె కూడా మృతి చెందింది. మృతి చెందిన గేదెలను బయటకు తరలించడానికి రూ.15 వేల వరకు ఖర్చు అవుతోందని రైతులు చెబుతున్నారు. గ్రామంలో ఇప్పటి వరకు 23 మంది రైతులకు చెందిన 33 గేదెలు అంతు చిక్కని వ్యాధి బారిన పడి మృత్యువాత పడ్డాయని రైతులు చెబుతున్నారు.

ధాన్యం తినడానికి పనికిరాదనడం సిగ్గు చేటు

తాళ్లపూడి: రైతులు పండించే ధాన్యం ఆల్కాహాల్ తయారు చేయడానికి తప్ప దేనికి ఉపయోగపడదని ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీ వేదికగా చెప్పడం రైతుల పట్ల ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుందని నియోజకవర్గ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని పెద్దేవం పంచాయతీ పరిధిలోని రావూరుపాడులో మంగళవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. తలారి వెంకట్రావు, మండల నాయకులు కలిసి కార్యక్రమంపై రచ్చబండ నిర్వహించి చంద్రబాబు ఏడాదిన్నర పాలనలోని మోసాలను ప్రజలకు వివరించారు. వెంకట్రావు మాట్లాడుతూ, చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రైతులు అన్ని విధాలుగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. యూరియా వాడితే క్యాన్సర్ వస్తుందని దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయాన్ని నిర్వీర్యం చేయడానికి చూస్తుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అన్నదాతలను అన్ని విధాలుగా ఆదుకోవడంతో పాటు వారికి భరోసా ఇచ్చామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొలిశెట్టి నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి సుంకర సత్యనారాయణ, కొవ్వూరు పట్టణ కన్వీనర్ చిట్టూరి అన్నవరం, సర్పంచ్ వెంకట్రావు, జిల్లా మాజీ ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు బట్టు సుబ్బారావు, కవల నాగేశ్వరరావు, వల్లభశెట్టి చిన్ని, దొరాజీ, కొసన శివ తదితరులు పాల్గొన్నారు.













నష్టపోయిన అరటి రైతులను ఆదుకోవాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ
కో–ఆర్డినేటర్ తలారి వెంకట్రావు



పెద్దేవంలో అరటి తోటను పరిశీలిస్తున్న తలారి వెంకట్రావు

తాళ్లపూడి: రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని, అరటి రైతులకు తక్షణం నష్ట పరిహారం అందజేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దేవం, రావూరుపాడు గ్రామాల్లో రెండు రోజుల క్రితం గాలులకు సుమారు 20 ఎకరాల్లో అరటి తోట పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. తలారి వెంకటరావు, జిల్లా మాజీ ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు పడిపోయిన తోటలను పరిశీలించారు. తలారి వెంకట్రావు మాట్లాడుతూ, అరటిగెలలు గాలులకు నేల మట్టవ్వడం చాలా బాధాకరమన్నారు. ఎకరాకు పెట్టుబడి రూ.2.5 లక్షలు అవుతుందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రామకృష్ణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు సుబ్బారావు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు సమస్య పరిష్కరించాలి

దేవరపల్లి: త్యాజంపూడి– యర్నగూడెం రోడ్డు సమస్యను తక్షణం పరిష్కరించాలని మంగళవారం రాత్రి జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో త్యాజంపూడి గ్రామస్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశానికి సీఐటీయూ మండల కార్యదర్శి భగత్ అధ్యక్షత వహించారు. ఉపసర్పంచ్ వెంకటసతీష్ మాట్లాడుతూ, పాలకులు మారినా ప్రజా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. పార్టీలకు అతీతంగా సమస్య పరిష్కారం కోసం ప్రజలు కలిసి రావాలని మాజీ సర్పంచ్ రత్నారెడ్డి అన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయండి



వేణుగోపాలకృష్ణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కొవ్వూరు నియోజకవర్గ నేతలు

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ పదవులు పొందిన ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం బొమ్మూరులోని పార్టీ కార్యాలయంలో ఆయనను కొవ్వూరు నియోజకవర్గానికి చెందిన పార్టీ రాష్ట్ర మున్సిపల్ వింగ్ సెక్రటరీ రుత్తల ఉదయభాస్కర్, జిల్లా గ్రీవెన్స్ సెల్ ప్రెసిడెంట్ నాగలపల్లి శ్రీనివాసరావు, మున్సిపల్ వింగ్ జనరల్ సెక్రటరీ సిద్దాన శ్రీనివాస్, పంచాయతీరాజ్ నియోజకవర్గ అధ్యక్షుడు మార్ని రామకృష్ణ, మున్సిపల్ కమిటీ సెక్రటరీ ఓలిపల్లి రాంబాబులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

షాపుల్లో తనిఖీలు

పెరవలి: దీపావళి మందుగుండు సామగ్రి హోల్‌సేల్ షాపుల్లో నిబంధనలకు అనుగుణంగా అమర్చాలని, వీటిలో ఎటువంటి తేడాలు వచ్చినా కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ నిరంజన్ హెచ్చరించారు. పెరవలి పరిధిలో ఉన్న శివశక్తి క్రాకర్స్, శ్రీలక్ష్మీ గణపతి, మారుతీ దీపావళి షాపులను మంగళవారం పరిశీలించారు. షాపుల రికార్డులు పరిశీలించి సంతృప్తి చెందారు. అనంతరం గోడౌన్‌లలో ఉన్న సరకును పరిశీలించి, అందుకు తగిన బిల్లులు తనిఖీ చేశారు. ఈ షాపుల వద్ద ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ పావని, స్థానిక వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

లేఅవుట్‌లలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

పెరవలి: జిల్లాలోని లేఅవుట్‌లలో మౌలిక సదుపాయాల గురించి స్వయంగా పరిశీలించి, ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఎందుకు నిర్మించుకోవటం లేదో తెలుసుకోవటానికే క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నానని జిల్లా హౌసింగ్ పీడీ బుజ్జి తెలిపారు. పెరవలి, కొత్తపల్లి అగ్రహారం, ముక్కామల, నల్లాకులవారిపాలెం, నడుపల్లి గ్రామాల్లోని లేఅవుట్‌లను మంగళవారం పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. కొన్ని లేఅవుట్‌లలో డ్రైనేజీలు లేవని, మరికొన్ని చోట్ల అసలు ఏమీ లేవన్నారు. వీటిని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. నిర్మాణాలు పూర్తి చేసుకుంటే త్వరగా నిధులు విడుదల అవుతాయన్నారు.